www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 డిసెంబర్ 2024
5





## 'మధ్యవర్తిత్వం' మంచి పద్ధతి

**ప్రజాశక్తి - కడప**

మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అని, ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందని తమిళనాడుకు చెందిన రిసోర్స్ పర్సన్, ట్రైనర్ డాక్టర్ ఎస్.పద్మ అన్నారు. గురువారం కడప కోర్టులోని ఎడిఆర్ కోర్టు హాలులో న్యాయవాదులకు మధ్య వర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్ వెంకటేశ్వరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఇ. ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె. హేమ ప్రశాంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడి కె. భార్గవి పాల్గొన్నారు.

# ప్రాజెక్టు కమిటీ ఎన్నికలకు కసరత్తు

- 21న కమిటీలకు చైర్మన్ల ఎన్నిక
- మూడు కమిటీలకు నోటిఫికేషన్
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

సాగునీటి ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. బుధవారం కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21న ఉదయం తొమ్మిది గంటలకు ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఈ నెల 17న సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంలో భాగంగా ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లాలో 15 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. గండికోట, మైలవరం, కెసి కెనాల్ ప్రాజెక్టులు కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలోని



మైలవరం ప్రాజెక్టు

ప్రాజెక్టు కమిటీల పరిధిలో చేరిన సంగతి తెలిసిందే. మీడియం, చిన్నతరహా ప్రాజెక్టుల్లో భాగంగా మధ్యతరహా ప్రాజెక్టులైన బుగ్గవంక, లోయర్ సగిలేరు, ఎగువ సగిలేరు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి ఈ నెల 21న సదరు ప్రాజెక్టులకు ఎన్నికలు నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బుగ్గవంక, లోయర్ సగిలేరు, ఎగువ సగిలేరులో పరిధిలో వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ఎన్నికైన 16 మంది సభ్యులు మాత్రమే ప్రాజెక్టు కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను ఎన్నుకునే అవకాశం ఉంది.

**ఎన్నిక తీరు ఇలా...**

ఈ నెల 21న ఉదయం తొమ్మిది గంటలకు జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం అనంతరం నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. అనంతరం 10.30 గంటలకు తుది జాబితా విడుదల చేయనున్నారు. 10.30 గంటల అనంతరం ఎన్నిక జరగనుంది. తరువాత జిల్లా అధికార యంత్రాంగం ఓటింగ్ చేపట్టనుంది. 12 గంటలకు కౌటింగ్ పూర్తి చేసిన అనంతరం ప్రాజెక్టు కమిటీ ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. అనంతరం ఒంటి గంట సమయానికి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వ్యవహారం తేలనుంది.

**ప్రశాంతంగా సాగేనా!**

ఈ నెల 17న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలకు నోడ్యూ సర్టిఫికెట్లు మంజూరు దగ్గర నుంచి వైసిపి నేతలను హౌస్ అరెస్టులు చేయడం వంటి అప్రజాస్వామిక వాతావరణంలో కూటమి పార్టీ అనుచరులు తీవ్ర అడ్డంకులు సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రత్యర్థి వైసిపికి చెందినమద్దతుదారులు సాగు నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఏకపక్ష వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తారా, లేక ఇదే తరహా అప్రజాస్వామిక వాతావరణాన్ని కొనసాగిస్తారా అనేది తేలాల్చి ఉంది.



కెసి కెనాల్

# విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలి



కడప విద్యుత్ భవన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

## విద్యుత్ భవన్ ఎదుట ఉద్యోగుల నిరసన

**ప్రజాశక్తి - కడప అర్బన్**

విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని విద్యుత్ భవన ఎదుట గురువారం భోజన విరామ సమయంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బర్నబాస్, చలపతి రామలింగారెడ్డి, స్ట్రగుల్ కమిటీ నాయకులు సుదర్శన్ రెడ్డి, శివశంకర్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చండీగఢ్, ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ సంస్థలు ప్రయివేట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 6 నుంచి నుంచి చండీగర్లో విద్యుత్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి చేస్తున్న తీవ్రమైన ఆందోళనలకు మద్దతు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అదాని కంపెనీ ద్వారా బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులకు, మీటర్ రీడర్లకు, ఇఆర్ఒలలో పనిచేస్తున్న సిబ్బందికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను ప్రయిటీకరణ చేసేందుకు యాజమాన్యం ప్రభుత్వాలు చాప కింద నీరుల ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఐకమత్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అండ్ ఎంప్లాయిస్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యుత్ సవరణల చట్టం 2022 ప్రతిపాదన విరమించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు 2022 నుంచి అరియర్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలకు కొత్త సిబ్బందిని ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరణ చేయరాదని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాకూబ్, రామచంద్రారెడ్డి, నాగ శేషారెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ శర్మ, నాగ సుబ్బయ్య, నాయబ్ రసూల్, జయప్ప విద్యుత్ భవన్లోని ఉద్యోగులు, ఇతర డివిజన్ నుంచి ఇచ్చిన విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఆర్‌టిపిపి ఉద్యోగుల ఆందోళన

**ఎర్రగుంట్ల :** విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరణ చేయొద్దంటూ గురువారం ఉద్యోగుల యూనియన్ సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఉత్తరప్రదేశ్, చండీగడ్‌లలో డిస్కమ్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఎఐఎఫ్ఇఇ, ఎన్‌సిసి ఒఇఇఇ ఆదేశాల మేరకు ఆర్‌టిపిపి ఆర్టిపిపి మెయిన్ గేట్ దగ్గర ఉద్యోగులు ఆందోళన నల్లబ్యాడ్జీలు ధరించి చేపట్టారు. ఈ సందర్భంగా 1104 యూనియన్ నాయకులు జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఉద్యోగాలకు భరోసా ఉండదని అన్నారు. ఉద్యోగులకు జీతభత్యాల చెల్లింపులో ప్రయివేటు సంస్థలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తాయని విమర్శించారు. ఉద్యోగులలో కోత విధించి తక్కువ మందిని తీసుకుంటారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెరగడంతో పాటు నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందదని అన్నారు. ప్రయివేటీకరణను ఎట్టి పరిస్థితులలో ఒప్పుకునేది లేదని అన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు



ఆర్‌టిపిపి వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

## సమర్ధవంతమైన పాలన కోసమే 'గుడ్ గవర్నెన్స్'

**ప్రజాశక్తి - కడప :** సమర్ధవంతమైన పాలన, సేవలను ప్రజలకు అందించడమే గుడ్ గవర్నెన్స్ ప్రధాన ఉద్దేశమని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. గురువారం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి.శ్రీనివాస్ 'గుడ్ గవర్నెన్స్ వీక్' ప్రచారాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి డిఆర్ఒతో పాటు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, సిపిఒ హజరతయ్య, డిఇఒ డాక్టర్ విజయ్ కుమార్, డిఐపిఆర్ఒ వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం డిఆర్ఒ మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ అంటే ప్రభుత్వం తన ప్రజలకు సమర్ధవంతంగా, పారదర్శకంగా, జవాబుదారీతో సేవలు అందించే విధానం అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'ప్రశాసన్ గావోన్ కి ఓర్- 2024' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుండి 24 వరకు నిర్వహించే గుడ్‌గవర్నెన్స్‌వీక్‌ను జిల్లాలో విజయవంతం చేయాలన్నారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సర్వీసులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఆయా సర్వీసుల ద్వారా సమాజానికి చేకూరిన ప్రయోజనాలను.. ప్రభుత్వానికి, సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీ కృష్ణకిషోర్

## అనాథలను ఆదరించడం అభినందనీయం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

సమాజంలో ఒంటరిగా ఉంటూ ఆదరణ లేని అనాథలను, వృద్ధులను, వికలాంగులను అక్కున చేర్చుకుంటున్న వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో సేవాశ్రమం సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతమైన కాశినాయన మండలం ఓబుళాపురం గ్రామంలో సేవాశ్రమం ఏర్పాటు చేసి నిస్సహాయులకు, అభాగ్యులకు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి గదులను నిర్మించి, మలమూత్రాలను సైతం విస్జరించే వారికి సేవలు అందిస్తూ నేటి సమాజానికి రామకృష్ణారెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సాయంతో ప్రశాంతమైన వాతావరణంలో ఎల్లప్పుడూ వైద్యుల పర్యవేక్షణలో అభాగ్యులకు ఉచితంగానే ఆశ్రయం కల్పించి సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివరామిరెడ్డి, హుస్సేన్,గోవింద రెడ్డి పాల్గొన్నారు.

## 'పెనుగొండ'కు కేంద్ర సాహిత్య పురస్కారం ప్రశంసనీయం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించడం ప్రశంసనీయమని కడప జిల్లా అరసం అధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ కవిగా రచయితగా విమర్శకుడిగా న్యాయవాదిగా బహుముఖ కోణాల్లో సామాజిక సేవ చేశారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ జాతీయ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించారని, ఇతర రాష్ట్రాల రచయితలకు తెలుగువారి గొప్పతనాన్ని తెలియజేశారని తెలిపారు. భారతదేశంలో సామాజిక కల్లోలాలు ఏర్పడిన ప్రతి సందర్భంలోనూ సాహిత్యకారులను ఏకం చేస్తూ రచనల ద్వారా జనాన్ని చైతన్య పరుస్తున్నారని పేర్కొన్నారు. పెనుగొండ రాసిన దీపిక అనే విమర్శ గ్రంథానికి పురస్కారం లభించిందని, ఆయన రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర భావి పరిశోధకులకు ఒక నమూనా గ్రంథంగా నిలుస్తుందని భవిష్యత్తులో ప్రతి జిల్లా నుంచి ఇలాంటి చరిత్రలు రావడానికి ఇది ప్రేరణ ఇచ్చిందని తెలిపారు. నిరంతరం సాహిత్య అధ్యయనం, లెక్కకు మించిన విమర్శ గ్రంధాల రచన పెనుగొండకే సాధ్యమైందని పేర్కొన్నారు.

## వైవీయూలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** క్రీస్తు మార్గం అనుసరణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య రఘునాథరెడ్డి, విశిష్ట అతిథి ఆచార్యపద్మ, దైవ సందేశకులు బెన్నీ ప్రసాద్ కేక్ కట్ చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిస్వార్ధంగా ఉండాలని ఏసుప్రభువు చెప్పారన్నారు. చెప్పారు. కులసచివులు ఆచార్య పి.పద్మ మట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, శాంతిని దయను సేవ భావాన్ని పెంపొదిస్తాయని చెప్పారు.

## దళితులకు భూ పంపిణీ చేయాలి : వ్య.కా.స

**ప్రజాశక్తి-కాశినాయన**

మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె రెవెన్యూ గ్రామంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, వెంటనే పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు గురువారం అక్కల్ రెడ్డి పల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామ దళితులు భూ పంపిణీ చేయాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ అక్కల్‌రెడ్డి పల్లె రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 1854 ప్రభుత్వ భూమిలో పేదలు సాగు చేసుకుంటున్నారని, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. లచ్చంపల్లి రెవెన్యూ పొలం సర్వేనెంబర్1లో భూమిని అధికారుల కొలతలు వేసి పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిరణ్, ఆరోగ్యం, ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి వలసలు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి అనేకమంది వైసిపి నాయకులు టిడిపిలోకి వలసలు వస్తున్నారని ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ద్వారకా నగర్ లోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో మంచి పేరు ఉన్న నాయకులను టిడిపిలోకి ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. 8 మంది వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరడం హర్షణీయమని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి ఖాళీ కావడం ఖాయమని జోష్యం చెప్పారు. తమ కుటుంబం పై నమ్మకం ఉంచి టిడిపిలో చేరిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని తెలిపారు. కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి మాట్లాడుతూ కడప అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కోసం కార్పొరేటర్లు టిడిపిలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇప్పుడిప్పుడే వైసిపి అంధకారం నుంచి నాయకులు బయటపడతున్నారన్నారు. పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. నగరంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతామని చెప్పారు. అనంతరం 8 మంది కార్పోరేటర్లను నాయకులను టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ముగిసిన న్యాక్ బృందం పర్యటన

**ప్రజాశక్తి - కడప :** ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), న్యాక్ బృందం రెండురోజుల పర్యటన గురువారం ముగిసింది. న్యాక్ కమిటీ చైర్మన్ ఆచార్య రాజీవ్ జైన్, మెంబెర్ కో-ఆర్డినేటర్ ఆచార్య మధురేంద్ర కుమార్, సభ్యులు డా. రమేష్ కుమ్బార్ హాజరై, కళాశాలలో అన్ని శాఖలను, అన్ని విభాగాలను సందర్శించి,అధ్యాపకులు తయారుచేసిన ఐదేళ్ల ప్రగతి నివేదికలను పరిశీలించారు. రెండవరోజు గురువారం మధ్యాహ్నం ముగింపు సమావేశంలో బృందం సభ్యులు మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులను వారి ఉద్యోగావకాశాలకు అవసరమయ్యే నైపుణ్యాలను, ఆయా అంశాల్లో బోధన,శిక్షణ తదితర కార్యక్రమాల ద్వారా చక్కగా అవగాహన కలిగించాలని కోరారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా తమ కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐక్యు ఎసి కో- ఆర్డినేటర్ డాక్టర్ బి.రామచంద్ర , ఉప ప్రధానాచార్యులు డా.ఎం.రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లాలోని క్రైస్తవ పాస్టర్ల సమస్యలను ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి హామీ ఇచ్చారు. గురువారం నగరంలోని ఎన్‌జిఒ కాలనీలో ఉన్న ఐక్య ఆరాధన ప్రార్ధనా మందిరం లో కిపివా, ఐఎఫ్ సిఎం సంస్థ గౌరవ అధ్యక్షులు ఎం.విక్టర్ పాల్, బిషప్ డానియల్, ఎన్. అజరయ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటే అని ఏమతమైన సత్యాన్ని బోధిస్తుందని చెప్పారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు మాట్లాడుతూ సర్వమతాల సారాంశం ఒక్కటే అని, మనం లౌకిక ప్రజాస్వామ్య దేశం లో ఉన్నామని అన్ని మతాల ప్రజలను సమానంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి బిషప్ కౌన్సిల్ నేత యలమంచిలి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, జీసస్ క్రైస్ట్ చర్చి బిషప్ డాక్టర్ కె. శామ్యూల్ బాబు, ఎపి పిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్, సెక్రటరీ బిషప్ రాజ్ కుమార్, పాలగిరి జాన్సన్, పాస్టర్ దాసరి సుధాకర్, పాస్టర్ మహేష్, బ్రదర్ పి.ఎస్.దాసు, రవితేజ, విజయ శేఖర్, పాస్టర్ కె.ఫిలిప్ పాల్గొన్నారు.

## పెరటి కోళ్లపై శిక్షణ

**ప్రజాశక్తి- చింతాకొమ్మదిన్నె :** ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు,. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎ. వీరయ్య మాట్లాడుతూ కెవికె వారు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ పొందిన తర్వాత ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం పశువు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఐ. సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పెరటి కోళ్లలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, వాటి నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం100 కోళ్లను ఎస్‌సి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్ బాబు, సాయి మహేశ్వరి, మానస, గిరీశ్ కుమార్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ నాయకులు

## బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్
## చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి : ఆవాజ్

**ప్రజాశక్తి - బద్వేలు**

స్వాతంత్ర్య సమరయోధులు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆవాజ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మసీద్ కాంప్లెక్స్‌లో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా పి.చాంద్‌బాషా, నానబాల వెంకటేశ్వర్లు, వైవీయూ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్నా సుబ్బారావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మెహబూబ్‌బాషా, సృజన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం బ్రిటిష్ పాలకుల కబంధ హస్తాల నుంచి మాతృభూమిని విముక్తి చేయాలనే తపన ఇరువురికి ఏర్పడిందన్నారు. వారు ఇద్దరు చదువుకు మధ్యలోనే స్వస్తి పలికి బ్రిటిష్ పాలన నుంచి మన దేశానికి విముక్తి కలిగించాలని హిందుస్థాన్ పబ్లికేషన్ అనే సంస్థలో చేరి జాతీయోద్యమ చరిత్రతో ఉత్తేజ పూరితమయ్యారని చెప్పారు. చివరి రోజుల్లో కూడా మత ప్రసక్తి లేకుండా భారతీయులంతా కలిసిమెలసి ఉండాల్సిందిగా అష్ఫాఖుల్లా ఖాన్ ప్రజలను కోరారు. 1927 డిసెంబరు 19న ఆయనను ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాదు జైలులో ఉరి తీస్తారనగా, అదేనెల 16న జైలు నుంచి దేశవాసులను ఉద్దేశిస్తూ ఒక లేఖ రాశాడు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ ఆవాజ్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ సత్తార్,షేక్ అన్వర్ భాష ,కౌన్సిలర్ మహమ్మద్ హుస్సేన్, ముస్లిం నాయకులు ఎస్.ఎం.బాషా, నూరుల్లా, షంషేర్, ఆవాజ్ నాయకులు దావూద్, మస్తాన్, రసూల్, ఖాజా గౌస్, మహమ్మద్, నాగూర్ పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** జిల్లాలో ఉన్న బిసి వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరి ంచేందుకు చొరవ చూపాలని పిడిఎస్‌యు నాయకులు కోరారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భరత్ కుమార్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి వసతి గృహ అధికారులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయ కపోవడంతో వసతి గృహ అధికారులు నాణ్యమైన భోజనం పెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతూ అప్పులు చేసుకుంటున్నారని తెలిపారు. సిద్ధవటం, నర్సాపురంలలో అత్యంత అవినీతి ఆరోపణలు ఎదొర్కంటున్న విజయమ్మ, లక్ష్మీదేవిని ఎస్‌సి వసతి గృహ అధికారులుగా లక్షలాది రూపాయలు డబ్బులు తీసుకుని నియమించారని ఆరోపించారు. వసతి గృహ అధికారుల నుంచి ప్రతినెలా ఎబిసి అధికారులు మామూళ్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయిన్నారు. కార్యక్రమంలో నగరనాయకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్,షామీర్ పాల్గొన్నారు.

## జిఒ145ను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాశక్తి - కడప :** కడప జిల్లా కేంద్రమైన కడపలోనే ఎన్‌డిపిఎస్ కోర్టును ఏర్పాటు చేయాలని, తిరుప లో ఏర్పాటుకు సంబంధించిన జీవో నెంబర్ 145 వెంటనే రద్దు చేయాలని కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ డిమాండ్ చేశారు. కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా న్యాయవాదుల రిలే దీక్ష శిబిరాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్‌తో కలిసి సందర్శించి న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ కేవలం తిరుపతిలోనే ఎన్‌డిపిఎస్ కోర్టును ఏర్పాటు చేయడం తగదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజలు ఎన్నుకుని, సంక్షేమ పరిపాలన ఆశించారన్నారు. కానీ వారి అభిప్రాయానికి విరుద్ధంగా ఆయన పనిచేస్తున్నారని విమర్శించారు. వెంటనే న్యాయవాదులు కోరుతున్న విధంగా కడపలోనే కోర్టు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడప అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, కాంగ్రెస్ పార్టీ నేతలు రఫీ ఖాన్, రహమతుల్లా ఖాన్, హామీద్, దినకర్ రెడ్డి పాల్గొన్నారు.



న్యాయవాదుల దీక్షలకు మద్దతు మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

## అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి : డిసిసి

**ప్రజాశక్తి-కడప**

కేంద్రహోం మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ నెల 17న రాజ్యసభలో భారత రాజ్యాంగ రూపశిల్పి, మహనీయ రాజకీయ నాయకుడు భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అప్రతిష్ఠాత్మకమైన, అనుచితమైన వ్యాఖ్యలు దారుణమని వాపోయారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీఖాన్, కడప అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, కమలాపురం అసెంబ్లీ కో- ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, కుల్లాయప్ప, హరి ప్రసాద్, మైనుద్దీన్, సంజయ్ కాంత, ఇనామ్, బండి భాస్కర్, హమీద్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంటులో అంబేద్కర్‌ను కించపరుస్తూ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్‌ను కించపరుస్తూ దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తినేవిధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాకు మంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కు ఏమాత్రం లేదని తెలిపారు. తక్షణమే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని పేర్కొన్నారు.

## ఇంధన పొదుపు తప్పనిసరి

**ప్రజాశక్తి- చెన్నూరు**

ఇంధనాన్ని పొందుపు చేయడమే లక్ష్యమని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సేవియా నాయక్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు కొండపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మనమందరం భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం అంటే అన్ని రకాల ఇంధనాలను పొదుపు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యుత్ పొదుపులో భాగంగా ప్రతి ఒక్కరూ గృహాలలో అనవసరంగా లైట్లు వేయడం, ఫ్యాన్లు తిరుగుతున్నప్పటికీ ఆఫ్ చేయకుండా ఉండటం, ఫ్రిజ్ పదేపదే తెరవడం నాణ్యతలేని బల్బులు, మోటార్లను వాడటం చేయకూడదన్నారు. రైతులు కూడా తమ పొలానికి అవసరం లేనప్పుడు మోటార్లను ఆఫ్ చేసి ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్తును ఉపయోగించడానికి ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌరవ ప్రధాన ఉపాధ్యాయులు నిర్వహించిన విద్యుత్ పొదుపు భవిష్యత్తు భరోసా అనే అంశంపై ర్యాంకులు పొందిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రామలింగారెడ్డి స్రవంతి దేవి, జూనియర్ ఇంజినీర్ ఇతర విద్యుత్ సిబ్బంది ఎం రవీంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి,మల్లారెడ్డి, ప్రేమ్చంద్, దొరబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పక్కా గృహాలకు దరఖాస్తులు చేసుకోవాలి

**ప్రజాశక్తి-చెన్నూరు :** సొంతంగా ఇల్లు లేని నిరుపేదలు పక్కా గృహాలకు 0.2 ప్రధాన మంత్రి ఆవాస్ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఎఇ మిలన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన పత్రాలను, స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు లేదా తహశీల్దార్‌చేత పొందిన పత్రాలు, కుల ధ్రువీకరణం, ఆదాయ పత్రం, భార్యాభర్త ఆధార్ లింక్ అయినా బ్యాంక్ అకౌంట్ పుస్తకొ, రేషన్ కార్డు, ఆధార్కు లింక్ అయినా మొబైల్ నెంబరు వంటివాటిని తీసుకుని హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.సొంత ఇల్లు లేని నిరుపేదలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె**

15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగం ద్వారా మండలంలో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ కుళాయిబాబు, విస్తరణ అధికారి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు మండల పరిధిలోని సి.కె. దిన్నె, కోలుములపల్లె, పాపాసాహెబ్‌పేట, బుసిరెడ్డిపల్లె, పబ్బాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైగ్రామాలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రేమలత, సంపత్ కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద పసికందుతో అధికారులు (ఇన్‌సెట్) దొరికిన బిడ్డ

## మానవత్వం మంట కలిసినవేళ..

**- ఏం చేసిందని ఈ పసిబిడ్డ..!**

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

మానవత్వానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించారు. జన్మనిచ్చిన వాళ్లే పసిబిడ్డను వదిలేసి వెళ్లిన ఘటన జమ్మలమడుగు పట్టణంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక ముద్దనూరు రోడ్డు గని గుంతల వద్ద ముళ్ల పొదల్లో గుర్తు తెలియని మగ శిశువును ఎవరో వదిలి పెట్టి వెళ్లారు. గురువారం ఉదయం, ఆ సమీపంలో స్థానికులకు, శిశువు ఏడ్పు వినబడడంతో వెంటనే పోలీసులకు, ఐసిడిఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు ఆ బిడ్డను జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. సమాచారం తెలుసుకున్న జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు ఆస్పత్రికి చేరుకొని శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. బిడ్డను ఎక్కడ ఎవరు పడేశారు.. ఏంటీ అనేదానిపై విచారణ చేపట్టారు. ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి ఆదేశాల మేరకు డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి మహేష్ శిశువుకు మెరుగైన చికిత్స అందించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. కడప రిమ్స్‌లో అడ్మిట్ చేస చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా పోలీసులు మాబుచాన్, శ్రీలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ పూర్తి సహకారం అందించినట్లు పేర్కొన్నారు. అన్ని కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్, డిఇ

## త్వరగా పనులు పూర్తి చేయాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు సంబంధించి నక్కలపల్లి సమ్మర్ స్టోరేజి వద్ద జరుగుతున్న పైప్‌లైన్ లీకేజి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషర్ డి.రాముడు సూచించారు. ఆ పనులను గురువారం కమిషనర్ రాముడు, మున్సిపల్ డిఇ చిదానంద రెడ్డి పరిశీలించారు. పనులను పూర్తిచేసి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఖలీల్ సౌదాగర్

## రక్తదానంతో ప్రాణదాతలు కండి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్, మైనింగ్ అడ్వయిజర్ డికె చౌదరి పిలుపునిచ్చారు. వేముల మండలం మబ్బుచింతలపల్లె గ్రామ సమీపంలో ఉన్న యురేనియం ప్రాజెక్టు ఎస్ఎంఎస్ వ్యవస్థాపకుడు శక్తికుమార్ ఎం, సన్‌శెటీ. జయంతి సందర్భంగా ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం శిబిరాన్ని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్ ప్రారంభించి, మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో దాదాపు 120 మంది కార్మికులు. సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిజిఎం ఎవి సురేష్‌బాబు, మేనేజర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్‌రెడ్డి, హెచ్ఆర్ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పంట నష్టాన్ని అంచనా వేయాలి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

తుపాను ప్రభావంతో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని, ఆ నష్టాన్ని అంచనా వేసి రైతన్నలను ఆదుకోవాలని టిడిపి మండల సీనియర్ నాయకుడు సందుల నాగశివారెడ్డి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఆ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావంతో నష్టం వాటిల్లిందని, ఈ విషయాన్ని రైతుల పక్షాన తాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టేలా తాను ఆదేశాలిస్తానని చెప్పారని పేర్కొన్నారు. పంట నష్ట నివేదికలు తెప్పించుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేందుకు కృషి చేయాలని తాను ఎమ్మెల్యేను కోరానని తెలిపారు. పత్తి, మినుము, వరి తదితర పంటలు భారీగా దెబ్బతిన్నట్లు వివరించానని తెలిపారు. ప్రభుత్వం తరుపున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయం గురించి కూడా ఎమ్మెల్యేకు తెలిపానని అన్నారు.

## ఇ-పంట నమోదు తప్పనిసరి : ఎడి

**ప్రజాశక్తి - చాపాడు**

రబీలో సాగుచేసిన ప్రతి పంటను ఆన్‌లైన్ ఇ-పంట నందు నమోదు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లిలో సాగైన జొన్న పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రబీలో సాగైనా మినుము, జొన్న, శనగ, పెసర, వేరుశనగ పంటలను ఇ-పంటలో నమోదు చేయాలన్నారు. ఇ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల రైతులకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫసల్‌బీమాకు డిసెంబర్ చివరి వరకు అవకాశం ఉందన్నారు. బీమా చెల్లించాలంటే ఇ క్రాప్‌లో పంట నమోదు అయి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మ్యాగీ, సాయిల్ కన్సర్వేషన్ ఎఒ బ్లేస్సి, అగ్రికల్చర్ అసిస్టెంట్ భార్గవి, టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

# రైతు కష్టానికి ప్రతిఫలం దక్కేనా..?

## వరుస తుపాన్లతో రైతుల్లో ఆందోళన.. అధికంగా శనగ సాగు



పూత దశలో ఉన్న తెల్ల శనగ పంట

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ప్రస్తుత తుపాను వల్ల కురుస్తున్న వర్షాలతో రైతుల్లో అలజడి మొదలైంది. సాగులో ఉన్న శనగ, మినుము, పెసర, పంటలకు నష్టం జరుగుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎకరా సాగుకు రూ.10వేల నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు పెట్టారు. పెట్టుబడితోపాటు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కుతుందా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వర్షాలు పడుతాయని వస్తున్న సమాచారంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రతి రైతు తమ పంటల సాగు వివరాలు ఇ క్రాప్ ద్వారా రైతు సేవ కేంద్రాల పరిధిలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం నుంచి పంట నష్టం పొందాలంటే ఇ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. మండల వ్యాప్తంగా రైతులు 12,375 ఎకరాల్లో శనగ పంట, 3,00ఎకరాల్లో మినుము, 215 ఎకరాల్లో పెసర, 550 ఎకరాల్లో నువ్వులు సాగు చేశారు. శనగ పంట పూత, పిందె దశలో ఉంది. ఈ వారంలో వర్షం పడితే పూత రాలిపోవడం, వేర్లు చనిపోవడం జరుగు తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. శనగ పంట జనవరి నెల ఆఖరులో కోతకు వస్తుంది. మినుము పంట కాయ దశలో ఉంది. మినుమును రైతులు నూర్పడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో కోశారు. కొన్ని ప్రాం తాల్లో పంటకోతలు మొదలు చేపట్టబోతున్నారు. వర్షం పడితే కాయలు పగిలి గింజలు రాలిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఈ పంట వారం రోజుల్లో పూర్తికానుంది.

**వర్షం వస్తే పంట పాడైపోతుంది**

30 ఎకరాల్లో తెల్ల శనగ పంట, రెండు ఎకరాలలో కంది పంట వేశాను. బంగాళాఖాతంలో అల్పపీడనమని, మూడు రోజులు తుపాను ఉందని అంటున్నారు. వర్షం వస్తే చేతికి వచ్చిన పంట పాడైపోతుంది. పోయినసారి కూడా పంట నష్టం జరిగింది. ఈసారి పంట బాగా పండితే ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల శనగ వస్తుందని అనుకుంటున్నాం. ఎకరాకు రూ.480 ఇన్సూరెన్స్ చేయించుకున్నాం.



**- సి.రామసుబ్బారెడ్డి, రైతు, హనుమన గుత్తి**

**శనగ పంట అధికంగా సాగు చేశారు**



మండలంలో శనగ పంటను ఎక్కువ శాతం సాగు చేశారు. తుఫాను వస్తుందని వాతావరణ శాఖ చెబుతోంది. రైతుల ఆందోళన చెందుతున్నారు. పంటల సాగు వివరాలను రైతులు నమోదు చేయించుకోవాలి. రైతు సేవ కేంద్రాల ద్వారా అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెం ట్ల ద్వారా పంట నమోదు ప్రక్రియ చేస్తున్నాం. ప్రతి రైతు పంటకు ఇ క్రాప్ చేయించుకోవాలి.

**- శ్రీకాంత్‌రెడ్డి, ఎఒ, ఎర్రగుంట్ల**

# భూనిర్వాసితులకు న్యాయం చేయాలి




మాట్లాడుతున్న తహశీల్దార్ రమాకుమారి

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని పిచ్చపాడు రెవెన్యూ పొలంలో నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి, న్యాయం చేయాలని రైతులు తహశీల్దార్ రమాకుమారిని కోరారు. గురువారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హైవేకు భూములు కోల్పోయామని, పలు రకాల సమస్యలతో రైతులకు నష్టపరిహారం అందలేదన్నారు. తహశీల్దార్ రమాకుమారి మాట్లాడుతూ హైవేలో భూములు కోల్పోయిన రైతుల వివరాలు సేకరించామని, వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. సమస్యలపై అర్జీలు ఇచ్చిన ప్రతి రైతుకు రసీదు అంద జేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, రీసర్వే డిటి నారా యణస్వామి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, విఆర్ఒ సుబ్బన్న, సర్వేయర్ సౌందర్య, మాజీ సర్పంచ్ హజరత్‌రెడ్డి, టిడిపి నాయకులు సుబ్బిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**రోడ్డు పనులు సజావుగా జరిగేలా చూడాలి**

నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులు తమ వద్ద ఉన్న పూర్తి ఆధారాలతో తమకు అందజేయాలని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అనంతపురం, బూడిదపాడు రెవెన్యూ గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులు పనులను అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆధారాలు సమర్పించిన రైతులకు నష్టపరిహారం అందజేశామన్నారు. ఇంకా ఎవరికైనా నష్టపరిహారం అందకపోతే రైతుల వద్ద ఉన్న ఆర్‌హెచ్, ఇసి, 1బి, సర్వేనెంబర్ వివరాలు తమకు అందజేయాలన్నారు. రికార్డులు పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. హైవే రోడ్డు పనులను సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో హైవే అథారిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు**

**వేంపల్లె :** భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె 1వ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వన్ బి అడంగల్‌తోపాటు వివిధ సమస్యలతో రైతులు వినతులను అందజేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 8వ తేదీవరకు ఈ రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. అనంతరం భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి

# రహదారి పక్కన రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లు

## పొంచి ఉన్న ప్రమాదాలు - భయాందోళనలో స్థానికులు



రోడ్డు పక్కన కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు


**ప్రజాశక్తి - ఖాజీపేట**

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామని చెబుతున్నా.. సమస్యలపై మాత్రం అధికారులు దృష్టి పెట్టడం లేదు. ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజల ఆందోళన చెందుతున్నా.. వాటి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో ఎమ్మెల్యే జోక్యంతో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకునేవి. ప్రస్తుతం ఎమ్మెల్యే సైతం సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణలేకుండా ఉన్నాయి. దిమ్మెలు తక్కువ ఎత్తులో ఉంటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు హడలిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పత్తూరు నుంచి థయాంఖాన్‌పల్లె దారిలో పొగాకు పరిశ్రమలకు అత్యంత సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వీటికి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. కొన్ని వాహనాలు పొగాకు సరుకుతో వెళ్లాల్సి ఉంటుంది. రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆయా ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కోటం గురువాయపల్లెలోని పలు దుకాణాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు, తీగలకు కంపచెట్లు అల్లుకుపోయాయి. వీటివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించిన దాఖలాల్లేవని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై సిఎంకు ఎమ్మెల్యే వినతి

**ప్రజాశక్తి - చాపాడు**

మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రమిచ్చారు. విజయవాడలోని సచివాలయంలో గురువారం ఎమ్మెల్యే సిఎంను కలిశారు. మైదుకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో దీర్ఘకాలికంగా నెలకొని ఉన్న పలు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పుట్టా ముఖ్యమంత్రికి వివరించారు.



## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి - లింగాల**

వాతావరణంలో మార్పులు కారణంగా విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. మండల కేంద్రంలోని ఎగువ లింగాల ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యంలోని ల్యాబొరేటరీని సందర్శించి, రికార్డులు పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, గాజు సీసాలు ఇంటి ఆవరణలో లేకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శివరాం, పిహెచ్ఎన్ కుసుమకుమారి, ఆశా కార్యకర్తలు శివ నారాయణమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి సిద్దయ్య



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

## వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలి

**ప్రజాశక్తి - వేముల**

ద్విచక్ర వాహనదారులు, కార్లు నడిపేవారు తప్పక రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక కడప-పులివెందుల ప్రధాన రహదారి దుగ్గన్నగారిపల్లి క్రాస్ వద్ద గురువారం ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలులేని వారికి ఇ చలానా విధించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాశక్తి - వేంపల్లె**

మరమ్మతుల నేపథ్యంలో వేంపల్లి పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ శివ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు శ్రీరామ్‌నగర్ కాలనీ, వైఎస్ రాజారెడ్డి నగర్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజీవ్ నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, ఫైర్‌స్టేషన్, ఎస్ఎన్ఆర్ కల్యాణమండపం, ఐటిఐ సర్కిల్, ఆర్‌టిసి బైపాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఎఇ కోరారు.



పిబిసి పులివెందుల మెయిన్ కాలవలో చేపట్టిన పూడికతీత పనులు

## పిబిసి ప్రధాన కాలువలో పూడికతీత

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి) ప్రధాన కాలువలో పూడికతీత పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలోని తొండూరు డిస్ట్రిబ్యూటరీ గేట్లకు సమీపంలోని 11 కిలోమీటర్ నుంచి అంకెవానిపల్లి గేట్ల వరకు పనులు ప్రారంభించారు. దాదాపు రూ.14 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా గడ్డి, జంబు, ఇతర పిచ్చి మొక్కలతోపాటు మట్టి పేరుకుపోవడంతో దిగువ ప్రాంతానికి నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగేది. గతంలో అనేకమార్లు రైతులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో ఫలితం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో రైతుల విన్నపం మేరకు పనులు చేపట్టారు.

**చివరి ఆయకట్టుకు నీరు చేరాలన్నదే లక్ష్యం**

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీటి సరఫరా జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా పూడికతీత పనులను చేపట్టాం. ఇటీవల రూ.18 లక్షలతో తొండూరు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని పూడికతీత పనులతోపాటు ఇతర పనులను పూర్తి చేశాం

**- రాజశేఖర్, ఇఇ.**